క్లుప్తంగా

ఇంటి స్థలం కబ్జాకు యత్నం



బాధితుడికి అండగా నిలిచిన స్థానికులు

ధర్మసాగర్ : 60 ఏళ్ల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరిన ఇల్లు, స్థలాన్ని కబ్జా చేయాలని ఓ వ్యక్తి పన్నాగం పన్నినట్లు బాధితుడు రావుల వెంకట్‌రెడ్డి ఆరోపించారు. అప్పటి కురువృద్ధులు, కుల పెద్దల సమక్షంలో ఈ విషయం శుక్రవారం బట్టబయలైంది. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. రావుల వెంకటరెడ్డి తండ్రి రావుల భుజంగారెడ్డి 1969లో ఆ స్థలంలో ఇంటిని నిర్మించినట్లు తెలిపారు. 1972లో రావుల వెంకటరెడ్డి, అతడి ఇద్దరు పిల్లలు నివాసం ఉంటూ పిల్లల వివాహాలు సైతం అదే ఇంటిలో జరిపించినట్లు తెలిపారు. చివరకు 2019లో రావుల భుజంగారెడ్డి మరణించడంతో పురోహితులు కొంత కాలం ఇంటిని వదలాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఇంటిని వదిలి దగ్గరలోని కపిల్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. పూర్వం నుంచి తన తండ్రి పేరిట ఉన్న ఇంటిని వెంకటరెడ్డి తల్లి రావుల వినోద పేరు పైకి మారిందని, 2022లో తన తల్లి నుంచి తమ్ముడు, సోదరి అనుమతితో వెంకటరెడ్డి తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరిన ఇంటి స్థానంలో నూతన ఇంటిని నిర్మించుకోవాలని ఇటీవల రావుల వెంకటరెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆ పరిసరాలలో నివాసముంటున్న ఓ వ్యక్తి ఎలాగైనా రోడ్డుని అనుకుని ఉన్న ఈ స్థలాన్ని కబ్జా చేయాలని పన్నాగం పన్నినట్లు తెలిపారు. పక్క ప్లాన్ వేసి కోర్టులో కేసు నమోదు చేయించాడని ఆరోపించారు. ఇంటి నిర్మాణ పనులు చేపట్టి ప్రతిసారి డయల్100 సమాచారం ఇచ్చి తనకు ప్రాణభయం ఉందని రావుల వెంకటరెడ్డిపై తప్పుడు సమాచారం, ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. దీంతో శుక్రవారం వారి కులస్తులు, కురువృద్ధులు, గ్రామస్తులు మూకుమ్మడిగా ఆ వ్యక్తి దురాగతాన్ని ఎండగట్టి నిజాలని బయటపెట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజాప్రతినిధిగా పనిచేసిన నాయకుడి స్థలమే కబ్జా చేసే ప్రయత్నం జరిగితే సాధారణ వ్యక్తుల పరిస్థితి ఎలా ఉంటుందోనని, స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు సామాజిక తనిఖీ

కమలాపూర్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండె బాబు, ఈజీఎస్ ఏపీఓ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 01 2024 నుంచి 31 మార్చి 2025 వరకు మండలంలో జరిగిన రూ.8.08 కోట్ల ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేసి ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అక్రమాలకు సంబంధించి ప్రజా వేదికలో వివరిస్తారని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా వేదికకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు హాజరు కావాలని కోరారు.

బంగారు గొలుసు అప్పగింత



ఐనవోలు : మల్లన్న ఆలయానికి దర్శనానికి వచ్చిన భక్తుడు బంగారు గొలుసును పోగొట్టుకోగా ఎస్సై పస్తం శ్రీనివాస్ స్వాధీనం చేసుకుని శుక్రవారం బాధితుడికి అప్పగించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందు గ్రామానికి చెందిన ముత్యాల మధు మల్లన్న ఆలయానికి గురువారం వచ్చారు. దేవాలయానికి సంబంధించిన గదిని అద్దెకు తీసుకుని బస చేసి వెళ్లిపోయారు. అనంతరం బంగారు గొలుసు పోయిందని స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశాడు. దీంతో భక్తుడు బస చేసిన గదిని దేవాలయ సిబ్బందితో కలిసి పోలీసులు పరిశీలించారు. సుమారు 1.5 తులాల బంగారు గొలుసు లభించడంతో బాధితుడి సమాచారం అందించారు. శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ చేరుకున్న బాధితుడు ముత్యాల మధుకు ఎస్సై పస్తం శ్రీనివాస్ బంగారు గొలుసును అప్పగించారు. దీంతో పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ ఎస్సై శ్రీనివాస్‌ను అభినందించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన అశోక్

శాయంపేట : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ శుక్రవారం ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

బీటీ రోడ్డు లేక ఇబ్బందులు

- రూ.కోటి అంచనాతో 2023లో శంకుస్థాపన
- రెండేళ్లు గడుస్తున్నా పూర్తికాని దుస్థితి
- పంథిని, చెన్నారం ప్రజలకు తప్పని తిప్పలు



పంథిని- చెన్నారం నడుమ గుంతలు, బురదతో ఉన్న మట్టిరోడ్డు

ఐనవోలు : పంథిని–చెన్నారం రెండు గ్రామాల నడుమ బీటీ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోగా ఇరు గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐనవోలు మండలం పంథిని గ్రామం నుంచి వర్ధన్నపేట మండలం చెన్నారం నడుమ సుమారు 3 కిలోమీటర్ల బీటీరోడ్డు గత ప్రభుత్వ హయాంలో మంజూరయ్యింది. రూ.కోటి అంచనా వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం నిధులు సరిపోవని అంచనాకు వచ్చి రీఎస్టీమేషన్ కోసం ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనుల ప్రారంభ దశలో కంకర పోయించి పలుచోట్ల కల్వర్టుల నిర్మాణం కూడా చేపట్టారు. తర్వాత నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. కాగా ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు, రైతులు నిత్యం నరకయాతన పడాల్సి వస్తోంది. గుంతలు, బురద ఉండటంతో రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల తుమ్మ చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. చెన్నారం గ్రామస్తులు పంథినిలో బ్యాంకు, మీ సేవా, పోస్టాఫీసుకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నారం నుంచి పంథినికి మరో మార్గం ద్వారా రావాలంటే సుమారు 8 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని, పాలకులు, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డును వెంటనే నిర్మించాలి



బీటీ రోడ్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తుండగా రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం అయ్యాయి. కానీ మున్నాళ్ల ముచ్చటగా మధ్యలోనే పనులు ఆగిపోయాయి. సరైన రోడ్డు మార్గం ఉంటే ఇరు గ్రామాల ప్రజలకు ప్రయోజకంగా ఉంటుంది. రైతులు ఎక్కువగా ఉండే ఈ మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలి.

- మోడెం మహేందర్, పంథిని

నాయకులకు చిత్తశుద్ధి లేదు



నాయకులకు చిత్తశుద్ధి లేకపోవడంతోనే బీటీ రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయి. రైతులు ఎరువులు, పంట రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. అధికార పార్టీకి చెందిన నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలి.

- కల్లెపు విజయ్, పంథిని

పశువుల సంత స్థలం కుంకుమయ్య గుడిదే

- ఫలించిన అర్చకులు, భక్తుల పోరాటం
- హైకోర్టు ఆదేశాలతో అదనపు కలెక్టర్ విచారణ



పరకాలలోని పశువుల సంత స్థలం

పరకాల: పరకాలలోని పశువుల సంత స్థలం శ్రీకుంకుమేశ్వర దేవస్థానానికి సంబంధించినదేనని అధికారులు తేల్చారు. వివరాలిలా ఉన్నాయి. పరకాల పట్టణ నడిబొడ్డున 991 సర్వేనంబర్‌లో రూ.కోట్ల విలువైన 4.11 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలంలో పశువుల సంతతోపాటు బహిరంగ సభలు, సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నారు. పశువుల సంతతో మున్సిపల్‌కు ప్రతి ఏడాది లక్షలాది రూపాయల ఆదాయం వస్తుండగా.. అందులో ఆలయానికి వాటా దక్కుతుంది. అయితే, ఈ స్థలం తమదేనంటూ కొందరు ప్రైవేట్ వ్యక్తులు పేర్కొన్నారు. స్థలాన్ని రక్షించుకునేందుకు 1982 సంవత్సరంలో దేవస్థానం అర్చకులు, భక్తులు, కొందరు ప్రముఖులు హైకోర్టును ఆశ్రయించారు. 43 సంవత్సరాలుగా వాదోపవాదాలు జరిగాయి. చివరకు 6 నెలల క్రితం హైకోర్టు ఆదేశాలతో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పలు దఫాలుగా విచారణ జరిపి రికార్డులు పరిశీలించారు. అ స్థలం శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించినట్లు తేల్చారు. పట్టణ ప్రముఖులు, భక్తుల సహకారంతో ఎన్నో ఏళ్ల తమ పోరాటం ఫలించినట్లు ఆలయ అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ తెలిపారు. పశువుల సంత భూమి దేవస్థానానికి చెందినట్లు తేలడంతో దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. పరకాల బస్టాండ్ కూడలిలో భక్తులు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకొన్నారు.



అదనపు కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ

పేదరికాన్ని రూపుమాపాలి

- న్యాయవాది పద్మ



మాట్లాడుతున్న న్యాయవాది పద్మ

ఆత్మకూరు : సమాజంలో పేదరికాన్ని రూపుమాపాలని న్యాయవాది పద్మ అన్నారు. మండల కేంద్రంలోని స్వర్ణభారతి మండల మహిళా సమాఖ్యలో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే ఆదేశాల మేరకు అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా మహిళలకు పేదరికంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. పేదరికంలో మగ్గుతున్న ప్రజల సమస్యలను గుర్తించి వారి పోరాటాలకు మద్దతుగా నిలవాలని అన్నారు. పేదరికం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదని అది గౌరవప్రదమైన జీవితానికి మానవహక్కులకు భంగం కలిగిస్తుందన్నారు. నైపుణ్యాలను సద్వినియో గం చేసుకోకపోవడం వలనే పేదరిక పెరుగుతోందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్

దామెర : ప్రస్తుతం సాంకేతికత రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో మోసాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హ్యూమన్ ట్రాఫికింగ్ అధికారి శ్యామ్‌సుందర్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అధ్యక్షతన మానవ అక్రమ రవాణ, బేటీ బచావో–బేటీ పడావోపై కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. సాంకేతిక మోసాలతో విద్యార్థులను అక్రమ రవాణాకు టార్గెట్ చేస్తున్నారని సూచించారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత బాలిక విద్యా ప్రాధాన్యతను వివరించారు. ఎస్సై, ఏఎస్సై, మానస, అర్షం రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వసుంధర, సౌజన్య, విజయప్రభ, స్వరూప పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు ప్రజాసంఘాల సంఘీభావం




పరకాల : బీసీ బంద్ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

పరకాల : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా రాష్ట్ర హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ శనివారం తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్‌కు వివిధ రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు పట్టణంలోని అమరధామంలో బీసీ బంద్ పోస్టర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపల్లి మల్లేషం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బీజేపీ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్‌రావు, డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, సీపీఐ నాయకుడు దుప్పటి సాంబయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు, బీసీ సంఘాల నాయకులు నిరంజన్, పూర్ణచారి, పురుషోత్తం, రాంబాబు, గోపినాథ్ పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు

బీసీ జేఏసీ పిలుపు మేరకు పరకాల పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థలన్నీ సెలవు ప్రకటిస్తూ సంపూర్ణ మద్దతు తెలిపాయి. అవసరమైతే నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులు సిద్ధమైనట్లు ప్రకటించారు.

శాయంపేట : రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల బోర్డు మెంబర్ బాసాని చంద్రప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బంద్‌కు సంఘీభావంగా ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో నిర్వహించే కార్ ర్యాలీలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకుడు మాదాసి సురేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలు చెప్పి బీసీలను మోసం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. బీసీల పోరాటానికి దళిత సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం మండల అధ్యక్షుడు కుమార్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు భిక్షపతి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రఘు, నాయకులు గణేశ్, సుధాకర్, ఐలయ్య, సూరయ్య, ప్రభాకర్, రాజయ్యతో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యాగశాల సంప్రోక్షణ



యాగశాల సంప్రోక్షణలో పాల్గొన్న భక్తులు

పరకాల : కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరాలయంలో వచ్చే నెల 3న అత్యంత వైభోవపేతంగా నిర్వహించతలపెట్టిన మహారుద్రయాగోత్సవంలో భాగంగా శుక్రవారం వేదమంత్రోచ్చరణల నడుమ యాగశాల సంప్రోక్షణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోమాళ్లపల్లి సంపత్‌కుమార్‌శర్మ 108 కలశముల నది జలాలతో ఆలయ ప్రాంగణం నుంచి మహారుద్రయాగోత్సవం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ ప్రాంగణానికి భక్తులు చేరుకుని సంప్రోక్షణ చేపట్టారు. ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మహారుద్రయాగ సమితి అధ్యక్షుడు లక్ష్మణ్, కన్వీనర్‌లు రవి, అశోక్, కోశాధికారి భద్రయ్య, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ సరోజనదేవి, గోవింద సంధ్య, తోట రవి, గౌరిశెట్టి నవీన్, సురేశ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి



మాట్లాడుతున్న సదానందం

శాయంపేట : అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ పౌరుడు కృషి చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం జాతీయ మానవ హక్కుల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ పౌరుడు అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని, మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూడాలని కోరారు. జాతీయ మానవ హక్కుల కమిటీ హనుమకొండ మండల అధ్యక్షుడు చల్లగురుగుల కుమార్, సంయుక్త కార్యదర్శి చల్లా ప్రతాప్‌రెడ్డి, శాయంపేట మండల అధ్యక్షుడు ఏదుల రాజశేఖర్, ఉపాధ్యక్షుడు మారబోయిన అనిల్, ప్రధాన కార్యదర్శి రేణికుంట్ల పృథ్వీరాజ్, సంయుక్త కార్యదర్శి వంశీ, సభ్యులు కమలాకర్, జయశంకర్, తిరుపతి, కార్తీక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను మోసం చేస్తున్న ప్రభుత్వం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

పరకాల : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ మంజూరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆరోపించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. మూడేళ్ల విద్యా సంవత్సరంలో రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను పెండింగ్‌లు ఉంచడం వలన విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ పరకాల మండల అధ్యక్షుడు ప్రశాంత్, బొజ్జ హేమంత్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశద్రోహం కేసు నమోదు చేయాలి



ధర్మసాగర్ : నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మసాగర్ : సుప్రీం కోర్టు సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జస్టిస్ బీఆర్.గవాయ్‌పై కోర్టులో జరిగిన దాడి యత్నం కేవలం సీజేఐపై జరిగింది కాదని యావత్ భారతదేశంలో ఉన్న దళితులపై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడి అన్నారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ సంతోశ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు శాంతిసాగర్, షేమిశోద్దీన్, బాబు, పవన్, ప్రశాంత్, రాజు, అశోక్, శంకర్, చేరాలు, ప్రమోద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడి యత్నానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సుమోటో కేసుగా స్వీకరించాలని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఏలియా, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎదుట ధర్నా నిర్వహించారు.

వేలేరు : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడికి యత్నించిన రాకేశ్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన అనంతరం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

శాయంపేట : సీజేఐ బీఆర్.గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్, ముఖేష్, భాస్కర్, చిరంజీవి, కుమార్, తిరుపతి, సాంబరాజు, శ్రీనివాస్, తిరుపతి, కుమారస్వామి, మహేశ్ పాల్గొన్నారు.

కమలాపూర్ : సుప్రీం కోర్టు సీజేఐ జస్టిస్ బీఆర్. గవాయ్‌పై దాడికి యత్నించిన రాకేశ్ కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ రవీందర్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. గవాయ్‌పై దాడి యత్నానికి వెనుకున్న శక్తులను గుర్తించి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రసాద్, రమేశ్, సంపత్, జనార్దన్ పాల్గొన్నారు.

హమాలీ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న మునీశ్వర్

పరకాల : హమాలీ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదికలో ఏఐటీయూసీ హమాలీ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఏఐటీయూసీ 50 ఏళ్ల పోరాటాల కారణంగానే కార్మిక సంక్షేమ పథకాలు అమలులోకి వచ్చాయన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్‌లల్లో పనిచేసే హమాలీ కార్మికులు, దాడ్వాయిల పరస్థితి అధ్వానంగా మారిందన్నారు. హమాలీల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమాతో పాటు 60 ఏళ్లు దాటిన కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, నాయకులు ఐలయ్య, శంకర్, యాదగిరి, రాజయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులో గల కస్తూర్బా పాఠశాలలో డాక్టర్ ప్రహసిత్ శుక్రవారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు జ్ఞాపకశక్తి లోపం, పరీక్షల భయం, ఆత్మహత్య ఆలోచనలు, ఒత్తిడి, ఆందోళనను అధిగమించేందుకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకుని చదువులో రాణించాలని అన్నారు. మానసిన సమస్యలు ఉంటే టెలి మానస్ 14416కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ మల్లేశం, సీహెచ్‌ఓ విజయ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీజీజీ , సెర్ప్ బృందం సందర్శన



మహిళా సమాఖ్య ప్రతినిధులతో అధికారుల బృందం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని స్వర్ణ భారతి మండల మహిళా సమాఖ్యను శుక్రవారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ), సెర్ప్ అధికారుల బృందం పరిశీలించింది. మండల సమాఖ్యలో సమావేశం కొనసాగే విధానం, మీటింగ్‌లో చర్చించే అంశాలు, గ్రామ సంఘాల పనితీరు, బ్యాంకు లింకేజీ, మహిళా శక్తి కార్యక్రమాలు, సెర్ప్ కార్యక్రమాలను పరిశీలించారు. పథకాల అమలు తీరుపై సభ్యులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా వారు మహిళలకు పలు సూచనలు చేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం దయాకర్, ఏపీఎం సుజాత, మహిళా సంఘం బాధ్యులు అరుణ, జ్యోతి, రుద్రమదేవి, రజని, అరుణ, కుమారస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనూహ్య

నడికూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ డాక్టర్ అనూహ్య ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏఎన్ఎమ్ భాగ్యలక్ష్మి, ఆశ వర్కర్లు సునీత, శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.